హెచ్‌ఎంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మున్సిపాలిటీ పరిధిలో గల కొత్తవలస మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తోట రమేష్, కె.భాస్కరరావు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యకు ప్రధానోపాధ్యాయుడికి సంబంధం లేదని చెప్పారు. పాఠశాల తెరిచే సమయం కంటే ముందే విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకున్నారని, ఈ వ్యవహారంలో హెచ్‌ఎం ప్రమేయం లేదన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి జిల్లా అధికారులు ఇలాంటి చర్యలు చేపట్టడం తగదన్నారు. రెండు రోజుల్లో హెచ్‌ఎం సస్పెన్షన్ ఎత్తివేయాలని, ఉపాధ్యాయులతో కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

రిక్తహస్తం

- బడ్జెట్‌లో మన్యం జిల్లాపై శీతకన్ను
- ఊసేలేని గిరిజన యూనివర్సిటీ
- జిల్లా కేంద్రాస్పత్రిలో కేన్సర్‌కు వైద్యసేవలు
- నేడు మండల కేంద్రాల్లో నిరసనలు : సిపిఎం

టిడిపి మద్దతుపైనే ఆధారపడిన కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం జిల్లాకు కొత్త ప్రాజెక్టులు, ఆగిపోయిన వెనుకబడిన ప్రాంత నిధులు, గిరిజన యూనివర్శిటీ భారీగా నిధులు కేటాయిస్తుందని ఆశించిన ఉమ్మడి జిల్లా ప్రజలకు నిరాశే మిగిలింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొంచి చేయి చూపింది. సాధారణ కేటాయింపులు మినహా ప్రత్యేకించి నిధులు, ప్రాజెక్టులేవీ లేకపోవడంతో అంతా పెదవి విరుస్తున్నారు. వెనుక బడిన ప్రాంతాలకు ఏడాదికి రూ.50 కోట్ల గ్రాంట్ ఇస్తామని గతేడాది జూలై బడ్జెట్‌లో చెప్పిన ప్రభుత్వం ఈ సారి అదీ కూడా లేదు. రాష్ట్ర విభజన సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న గిరిజన యూనివర్శిటీకి ఇసుమంతైనా నిధులు కేటాయించకపోవడం పట్ల గిరిజనుల పట్ల బిజెపి ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. జిల్లా కేంద్రాస్పత్రుల్లో కేన్సర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంతో జిల్లాలో రోగులకు ఉపశమనం కలగనుంది. ఐదేళ్లలో 75వేల సీట్లు పెంచుతున్నట్లు ప్రకటించడంతో జిల్లాలోని మెడికల్ కళాశాలల్లో సీట్లు పెరగనున్నాయి. దీంతో మరింత మంది వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశం కలగనుంది. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు.



ప్రజాశక్తి-పార్వతీపురం

విజయనగరం జిల్లాలో తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయింపులో మొండిచేయే చూపారు. ఈ బడ్జెట్ సమావేశంలోనైనా నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసినవారికి నిరాశే ఎదురైంది. గిరిజన యూనివర్సిటీకి ఏటా అరకొర కేటాయింపులే జరుగుతున్నాయి. ఈసారి అది కూడా లేకపోవడంతో జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేక పనులు నత్తనడకన సాగుతున్నాయి. సరైన భవనాలు లేక తరగుతులు కూడా పరాయి పంచన నిర్వహించాల్సి వస్తోంది. మరడాం-మెంటాడ మండలం కుంటినవలస గ్రామాల పరిధిలో 560 ఎకరాలను వర్సిటీకి కేటాయించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విశ్వ విద్యాలయాన్ని ఈ క్యాంపస్ నుంచే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2027 నాటికి పూర్తిస్థాయిలో భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. నిధులపై స్పష్టత లేకపోవడంతో పనులు ఎంత వరకు ముందుకు కదులుతాయన్నది సందిగ్ధమే.

మన్యం జిల్లాలో లక్షా 30,118మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి 3.24లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. అధికారంలోకి వస్తే స్వామినాధన్ కమిషన్ అమలు చేస్తామని 2014లోనే బిజెపి ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు అమలు కాలేదు. మద్దతు ధరలకు గ్యారంటీ చట్టం చేయాలని రైతులు ఇప్పటికీ ఆందోళనలు సాగిస్తున్నా కేంద్ర ప్రభుత్వం దాని జోలికి వెళ్లలేదు. రైతులకు కిసాన్ సమ్మాన్ నిధిని మొత్తాన్ని ప్రభుత్వం పెంచనుందనే ప్రచారం సాగినా బడ్జెట్‌లో పెంపు ప్రస్తావన లేకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందారు.

ప్రస్తావన లేని వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్

విభజన చట్టంలో పేర్కొన్న మేరకు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం తప్ప, అమలుపై చిత్తశుద్ధితో మాట్లాడలేదు. గతంలోనూ ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పినా అమలు కాలేదు. విభజన చట్టం ప్రకారం ఏటా రూ.50కోట్ల చొప్పున జిల్లాకు ఇవ్వవాల్సిన బిజెపి ప్రభుత్వం ఒకే ఒక్క సంవత్సరం ఇచ్చి ఆ తరువాత కేటాయించిన నిధులు కూడా వెనక్కి తీసుకుంది. ఈ లెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు రూ.64కోట్లు మించి అందలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో అదికూడా ప్రకటించలేదు.

జిల్లా కేంద్ర ఆసుపత్రికి కేన్సర్ సెంటర్

దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో కేన్సర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొంది. దీంతో జిల్లా కేంద్రాస్పత్రిలో సెంటర్ ఏర్పాటు కానుంది. దీంతో కేన్సర్ పరీక్షలు, చికిత్స కోసం విశాఖతో పాటు జిల్లాలోని ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవస్థలు తప్పనున్నాయి.

కొత్త పన్ను విధానంపై వేతన జీవుల పెదవి విరుపు

ఆదాయపు పన్ను పరిమితి విషయంలో ఉద్యోగులు ఆశించినంతగా ఊరట దక్కలేదు. ఉద్యోగులు పొందే మూల వేతనంలో రూ.12 లక్షల వరకు ఆదాయం పొందుతున్న వారికి పన్ను మినహాయించినా పాత స్లాబ్‌లే కొనసాగించడంతో పెద్ద ఒరిగేదేమీ ఉండదని ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. కొత్త విధానం ప్రకారం రూ.4 లక్షల లోపు ఆదాయం పొందుతున్న వారికి పన్ను మినహాయింపు ఇస్తున్న నేపథ్యంలో దానిని మినహాయించి రూ.9.75 లక్షలకు ఆయా స్లాబ్‌ల ప్రకారం పన్ను మదింపు చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 25వేల మంది, ఉపాధ్యాయులు 9600 మంది, పెన్షనర్లు 20వేల మంది ఉండగా వారిలో 7వేల మంది వరకు ప్రయోజనం పొందవచ్చునని అంచనా.

జిల్లాకు ఒరిగింది శూన్యం

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి ఎటువంటి మేలు జరగలేదు. జిల్లా ప్రజల ఆశలను అడియాసలు చేసింది. జిల్లాలోని ప్రధానంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టింది. విభజన చట్టం ప్రకారం వచ్చిన గిరిజన యూనివర్శిటీకి నిధులు కేటాయించక పోవడం అన్యాయం. వెనుకబడిన జిల్లా అయిన మన్యం జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం దారుణం. గిరిజన యూనివర్శిటీకి నిధుల కేటాయింపు ప్రస్తావించకపోవడం అన్యాయం.

- కొల్లి గంగునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి

రాష్ట్రానికి చేసిందేమీ లేదు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెడుతూ 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులే' అని గురజాడని తలుచుకోవడం తప్ప బడ్జెట్లో రాష్ట్రానికి మేలు చేసేదేమీ ప్రకటించ లేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల దాటినా విభజన చట్టంలో ఉన్న అంశాల అమల్లో ఇప్పటికీ తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఊసే లేదు. వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్న డిమాండ్‌ను పట్టించుకోలేదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రతిపాదన వెనక్కి తీసుకోలేదు. స్టీల్‌ప్లాంట్‌కి ప్రత్యేక గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కార్మికులు చేస్తున్న డిమాండ్‌ను పెడచెవిన పెట్టారు. విశాఖపట్నం డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఇవ్వాలని కోరితే, ఆ విషయం కూడా బడ్జెట్లో లేదు. ఢిల్లీ, బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తయారు చేసిన బడ్జెట్‌లా ఇది కనిపిస్తోంది. ఆదాయ పన్ను శ్లాబుల్లో కొన్ని మార్పులు చేసి కొంత ఊరట కల్పించినా, ఉద్యోగులు కోరుకున్న విధంగా మాత్రం జరగలేదు. ఇన్సూరెన్సు రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని 74 నుండి 100 శాతానికి పెంచడం దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి నష్ట చేసే చర్య.

- ఎం.శ్రీనివాస, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

కార్పొరేట్ల బడ్జెట్

బడ్జెట్ సామాన్యులకు కాకుండా కార్పొరేట్లకు ఫుల్‌మీల్స్‌లా ఉంది. ఆదాయపు పన్ను రాయితీ ఇచ్చినా, పెరిగే ధరల వల్ల మధ్యతరగతి వారి జేబులకు చిల్లు పడతాయి. ఉపాధి హామీ చట్టానికి నిధులు సరిగా కేటాయించలేదు. వెనుకబడి జిల్లా అయిన మన్యం జిల్లా అభివృద్ధికి ఎలాంటి కేటాయింపుల్లేవు. గిరిజన యూనివర్శిటీ నిధులు ఇవ్వకపోవడం దారుణం

కూరంగి మన్మధరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి.

రాష్ట్రానికి నిధులు సాధించడంలో కూటమి విఫలం

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నప్పటికీ కేంద్ర బడ్జెట్లో నిధులు సాధించడంలో విఫలమయ్యారు. 12మంది ఎంపిలు ఉన్న బీహార్‌కు ఎక్కువ నిధులు ఇచ్చారు. 16మంది ఎంపిలు ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి ఏం తెచ్చింది. కేవలం కూటమి ప్రభుత్వం రూ.5 వేల కోట్లును మాత్రమే తీసుకొచ్చింది.

అలజంగి జోగారావు, వైసిపి మాజీ ఎమ్మెల్యే

బీహార్‌కు వరాలు ఫుల్... ఆంధ్రాకు నిల్

కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు వరాలిచ్చి, ఆంధ్రాకు మొండిచేయి చూపారు. బీహార్‌పై ఆధారపడి కేంద్రం పరిపాలన సాగిస్తుండటంతో నిధులు కేటాయించారు. ఉపాధి అవకాశాలు పెంచే మార్గాలు బడ్జెట్‌లో కనిపించలేదు. గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించక పోవడం సరికాదు. అధిక జనాభాగా ఉన్న వారికి బడ్జెట్ కేటాయింపుల్లో ఎటువంటి ఉపశమన చర్యలూ లేవు. ప్రధానంగా ధరలు తగ్గించే అవకాశం బడ్జెట్‌లో కనిపించడం లేదు.

- డివిజి శంకరరావు, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్

కేంద్ర బడ్జెట్‌లో గురజాడ ప్రసక్తి గర్వకారణం

పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్లో గురజాడ గీతాన్ని ఉటకాయిం చడం తెలుగు వారికి గర్వకారణం. బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మకం. దీంతో మధ్యతరగతికి మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు.

బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం.

రాష్ట్రానికి తీరని ద్రోహం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ద్రోహం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఇస్తామని చెప్పిన ప్రత్యేక హెూదా లేదు, ప్రత్యేక ప్యాకేజీ కింద నిధుల మంజూరు కూడా లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కూడా అరకొర నిధులు కేటాయించి చేతులుదులుపుకున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్రలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఊసే లేదు.

గేదెల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు

వేతన జీవులకు ఊరటనిచ్చిన బడ్జెట్

మధ్యతరగతి, అల్పాదాయ వర్గాలకు ఆదాయపన్ను విషయంలో కొంత ఊరటను ఇచ్చింది. రూ.12 లక్షల ఆదాయం దాటిన ఉద్యోగస్తులకు ఈ బడ్జెట్ ఉపయోగకరంగా లేదు. ఏది ఏమైనప్పటికీ గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్లో ఆదాయపన్ను విషయంలో అల్ప ఆదాయం వర్గాల వారికి మేలుగా ఉంది.

తెర్లి రవికుమార్, అర్థశాస్త్ర అధ్యాపకులు. పార్వతీపురం

పాఠశాలల విలీనంపై పున:పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ పాఠశాలల మిళితంపై ఇప్పటికే తయారు చేసిన నివేదికను పునఃపరిశీలన చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. దీనివల్ల విద్యా వ్యవస్థ మరింత బలోపేతం కానుందని, కావున దీనిపై విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో ప్రత్యేక కసరత్తు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల మిళితంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక అంతరాలు తొలగించి ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పాఠశాల ఉండేలా మిళితం చేసే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థుల్లో డ్రాపౌట్స్‌ను పూర్తిగా అరికట్టడానికి ఈ నూతన విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి మంచి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, కావున విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో మిళితం చేయనున్న పాఠశాలలపై మరోమారు కసరత్తు చేయాలని, దీనివల్ల విద్యార్థులు లాభపడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మిళితం చేసే అంశాన్ని ముందుగా విద్యార్థుల తల్లితండ్రులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారాన్ని అందించి, అవగాహన కల్పించాలని, అయితే ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి నడుచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల డ్రాపౌట్స్‌ను గుర్తించి కళాశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యపర్చాయలని అన్నారు. విద్యార్థుల్లో సమానత్వంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, డిఇఒ డా. ఎన్.తిరుపతినాయుడు, ఎస్ఎస్ఎ ఆర్.తేజేశ్వరరావు, డిప్యూటీ డిఇఒలు డి.రాజ్ కుమార్, పి.కృష్ణమూర్తి నాయుడు, ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో కార్యదర్శి నివేదికపై జరుగుతున్న చర్చల్లో పాల్గొన్న పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధులు

రోడ్డు పనులు వేగవంతం

ప్రజాశక్తి - సీతంపేట

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాల్లో చేపడుతున్న రోడ్డు పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమం కింద మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. అదే విధంగా పనుల్లో నాణ్యత లోపించకూడదని అన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్క రించుకొని పనులు ప్రారంభించాలని సూచిం చారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి మంజూరైన అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమం లో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ రమాదేవి, పంచా యతీరాజ్ ఇఇ రవి, డిఇలు సింహాచలం, రాధా రాణి, లోకనాథం, ఎఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

5న జాబ్‌మేళా

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో ఈనెల 5న సీతంపేట వైటిసిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ ఆపరేటర్, బ్రాంచ్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిసా మని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన, 18 నుంచి 35 ఏళ్లలోపు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో 6 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ 6 కంపెనీల్లో 400 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, గుంటూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు వివరాలకు 9985210162, 9154662567, 95151 67024 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కేసుల రాజీకి చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి దామోదరరావు

పెండింగ్ కేసులను రాజీ చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, బార్ అసోసియేషన్ సభ్యులను, లాయర్లకు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అధ్యక్షులు ఎస్.దామోదరరావు సూచించారు. మార్చి 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి తీసుకునే చర్యలపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెండో అదనపు జిల్లా జడ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసులు అధిక మొత్తంలో రాజీ కుదిర్చేలా కృషి చేయాలని తెలిపారు. కోర్టులో ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉండడం వల్ల కక్షిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందువల్ల సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్జి అన్నారు. రాజీ చేయడం ద్వారా కక్షిదారులకు శ్రమ, ఖర్చుల నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్ఫిన్, పట్టణ, రూరల్, గరుగుబిల్లి ఎస్ఐలు గోవింద, సంతోషి కుమారి, రమేష్ నాయుడు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రేవతమ్మ, హెడ్ కానిస్టేబుళ్లు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొర్లె వెంకటరావు, లాయర్ ఎం.వెంకటరావు, ఎన్.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అధ్యక్షులు ఎస్.దామోదరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్ కేసులు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసులు పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు, కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను సత్వరంగా పరిష్కరించుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ సేవలు ఉచితంగా పొందవచ్చునని ఆ ప్రకటనలో తెలిపారు.

1/70 చట్టం జోలికొస్తే ఖబడ్దార్

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు రక్షణ కవచంలా ఉండే 1/70 చట్టం జోలికొస్తే ఖబడ్దార్ అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గిరిజనులు హెచ్చరించారు. 1/70చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, గిరిజన ప్రజలకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు క్షమాపణ చెప్పాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మధు కైలాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దశాఖలో శుక్రవారం రాత్రి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మధు కైలాస్, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ 1/70 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఇటీవల విశాఖలో జాతీయ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ చేసిన వ్యాఖ్యలు ఆదివాసీల్లో తీవ్ర ఆందోళన కలిగించేలా ఉన్నాయని అన్నారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీలు 5వ షెడ్యూలు కిందకు వస్తుందని తెలిపారు. దీన్ని ధిక్కరించే అధికారం ఏ ప్రభుత్వానికి కూడా లేదని పేర్కొన్నారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. బినామీల పేరుతో గిరిజన భూముల్లో లాడ్జీలు పెట్టి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు 1/70ను సవరిస్తే గిరిజనులకు భూమి దక్కకుండా పోతుందని, ఏజెన్సీలో లభించే సహజ వనరులు బడా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎప్పటి నుంచో కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు దీన్ని మరింత బలపరుస్తున్నాయన్నారు. ఈ చట్టం మూలంగానే గిరిజనులకు ఎంతోకొంత భూమిపై అధికారం వచ్చిందన్నారు. ఇప్పటికే అభివద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలు 1/70ను సవరిస్తే మరింత వెనుకబడిపోతాయని, తక్షణం ఇలాంటి ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు గిరిజన యువకులు పాల్గొన్నారు.

కురుపాం : ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ డిమాండ్ చేశారు. మండలంలోని ఏగులువాడ పంచాయతీ పొరడంగూడలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.లింగరాజు ఆధ్వర్యంలో గిరిజనులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనులు అభివృద్ధి చెందాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రకటించడాన్ని సిపిఐ, గిరిజనులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాదు, మండింగి సింగన్న, మోహనరావు, పత్తు తదితరులు పాల్గొన్నారు.

4 నెలలుగా జీతం లేదు... న్యాయం చేయండి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - పార్వతీపురం



శంకరరావు వినతిని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

నాలుగు నెలలుగా తనకు జీతం బిల్లు పెట్టలేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, తనకు న్యాయం చేయాలని గిరిజన పంచాయతీ కార్యదర్శి ఎం.బాలాకుమారి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ని వేడుకున్నారు. శనివారం ఆమె విజయనగరంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వీరఘట్టం మండలం చిన్న గోర కాలనీ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న తనకు నాలుగు నెలలుగా జీతం బిల్లు పెట్టడం లేదని చెప్పారు. పంచాయితీ కార్యదర్శుల బదిలీల్లో భాగంగా తనకు మొదట భామిని మండలం బదిలీ చేశారని, తాను ఆ గ్రామంలో చేరలేదని చెప్పారు. ఎంపిడిఒ కూడా తనకు రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వలేదని తెలిపారు. అయితే రివైజ్డ్ బదిలీల్లో తనకు వీరఘట్టం మండలం చిన్న గోర కాలనీ పంచాయతీకి బదిలీ చేశారని, అక్కడ చేరానని చెప్పారు. అయితే చిన్నగోర కాలనీ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన కె.సునీల్ కుమార్‌కు వంగర మండలం బదిలీ చేశారని, ఆయన అక్కడ విధుల్లో చేరాలని తెలిపారు. మూడు రోజుల తర్వాత వంగర మండలం బదిలీ అయిన సునీల్ కుమార్‌ని మళ్లీ చిన్న గోర కాలనీ పంచాయతీకి బదిలీ చేశారని, ఆయన్ను ఎంపిడిఒ విధుల్లో చేర్చుకున్నారని చెప్పారు. అయితే గత నాలుగు నెలలుగా తనకు జీతం బిల్లు పెట్టకుండా సునీల్ కుమార్‌కు జీతం బిల్లు పెడుతున్నారని చెప్పారు. తనను మరో పంచాయతీకి బదిలీ చేయలేదని, నాలుగు నెలలుగా గాలిలో పెట్టారని చెప్పారు. తనకు రెండేళ్ల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుటుంబ పోషణ తన పైనే వుందని చెప్పారు. తనకు జీతం ఇప్పించి చిన్న గోర కాలనీ పంచాయతీ కార్యదర్శిగా కొనసాగేలా చూడాలని కోరారు. దీనిపై కమిషన్ చైర్మన్ శంకరరావు మాట్లాడుతూ శ్రీకాకుళం, మన్యం జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఏపి పాల రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి - సీతానగరం

విశాఖ డెయిరీ కి పాలు సరఫరా చేస్తున్న పాల రైతులకు ఆవు పాల ధరను 10 శాతం తగ్గించి తీసుకుంటున్నారని, డైరీ యాజమాన్యం పేరుగాని, హోదా గాని లేకుండా తగ్గింపు ధర సర్కులర్‌ను చూపించి లీటరుకు తక్కువ ధర లెక్కకట్టి సిబ్బంది తమ చేతివాటం చూపి పాల రైతులను మోసం చేస్తున్నారని దీనిపై ఈ నెల 3న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. డైరీ చైర్మన్, పాలకవర్గం డైరీ ఆస్తులను లాభాలను కాజేసి, అక్రమాల నుండి తమను తాము కాపాడుకోవడానికి రోజుకో పార్టీ మారుతూ, పాల రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారన్నారు. సేకరించిన పాలను మార్కెటింగ్‌పై ముందస్తు ప్రణాళిక లేకుండా, మిగులు పాలు పేరుతో పాల సేకరణను, పాల ధరను తగ్గించిన డైరీ యాజమాన్య కుట్రలను త్రిప్పి కొట్టాలన్నారు. ఇప్పుడున్న పాలకవర్గం డైరీ అభివృద్ధి కోసం కాకుండా తమ సొంత అభివృద్ధి కోసం పని చేస్తున్నారని రైతులందరూ ఐక్యమత్యంగా ఉండి పాలకవర్గం నుంచి విశాఖ డైరీని కాపాడుకోవడానికి పాల రైతులు పాల్గొనాలని కోరారు.

ఒకటో ప్లాట్‌ఫాంపై రైళ్లు ఆపాలి

ఎడిఎన్ రాజేంద్రకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కొమరాడ

గుమడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఐదు రైళ్లను ఒకటవ ప్లాట్‌ఫాంపై నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. రాయగడ ఎడిఎన్ రాజేంద్రకుమార్‌కు సిపిఎం ఆధ్వర్యంలో గుమడ రైల్వే స్టేషన్ వద్ద శనివారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, టిడిపి అరకు పార్లమెంటు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు గుమడ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. విశాఖ నుంచి రాయగడ మీదుగా దుర్గ్ వెళ్లే ఎక్స్‌ప్రెస్, విశాఖ టు కొరాపుట్టి, విశాఖ టు రాయపూడి, విశాఖ టు భవాని పట్నం వెళ్లే రైళ్లు, గుంటూరు నుంచి రాయగడ వచ్చే ట్రైన్లు అప్పుడప్పుడు ఒకటో ప్లాట్‌ఫామ్‌పై ఆగుతున్నాయని మిగతా సమయంలో పైన తెలిపిన ట్రైన్లు ఒకటో ప్లాట్‌ఫామ్‌కు రాకుండా 2,3,4 ఫ్లాట్‌ఫామ్‌లో నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీని వల్ల 60 మెట్లు ఎక్కి 2,3,4 ఫ్లాట్‌ఫారాలకు ప్రయాణికులు చేరుకోవడానికి వయసు మీరిన వారు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం పైన తగు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ చేయకుండా వేధిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈనెల 5న నిర్వహించబోవు ఫీజు పోరు కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను శనివారం క్యాంపు కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద పిల్లలపై కక్ష సాధింపు చర్యలకు దిగిన చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టి రాక్షసత్వంగా వ్యవహరిస్తోందన్నారు. ఫీజులు కట్టకపోవడంతో కాలేజీల నుంచి విద్యార్థులను వెళ్లగొడుతున్నారని దిక్కు తోచని స్థితిలో చదువులు మధ్యలో ఆగిపోతున్నా సర్కారు చోద్యం చూస్తున్నారని అన్నారు. పేదలు చదువుకోరాదన్న ఉద్దేశంతో చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజనులు ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఆరోగ్యకరంగా ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు అన్నారు. మండలంలోని పూడేసిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఐఆర్‌పిడబ్ల్యుఎ, పాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలన్నారు. అంతేకాకుండా సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు జాగ్రత్త తీసుకుని ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఆయన తెలిపారు. పార్వతీపురం వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్ ప్రభాకర్ మలేరియా, డెంగీ వ్యాధులు పట్ల, ఆహారం పట్ల శ్రద్ధ తీసుకోవాలని చూపించారు. అనంతరం ఎం.శ్రీరాములు గిరిజన మహిళలకు, పూడేసు గ్రామపంచాయతీ ప్రజలకు సుమారు వందమందికి దుప్పట్లు దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రెటరీ వి.శ్రీహరి, గ్రామ పెద్దలు బుద్ధబాబు, వైస్ సర్పంచ్ రాజేశ్వరి, లోకనాథం, స్కూల్ టీచర్ రామానాయుడు, విజయ్ కుమార్, ఐఆర్పిడబ్ల్యుఎ డైరెక్టర్ ప్రకాష్, సిబ్బంది సత్యనారాయణ, లక్ష్మణ్ గ్రామ ప్రజలు 150 మంది ఉన్నారు.

రథసప్తమికి ప్రసాదాల వితరణ

ప్రజాశక్తి - సీతంపేట

ఆర్ట్స్ సంస్థ సౌజన్యంతో పెదరామలోని మన్యం సహజ విడివికె సభ్యులు శ్రీకాకుళంలో జరగనున్న రథసప్తమి మహోత్సవ వేడుకలకు పదివేల రాగి లడ్డూలు, పులిహోరా పొట్లాలను తయారు చేసి ప్రసాదంగా ఇస్తున్నారు. వీటికి సంబంధించిన వాహనాన్ని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని విడివికె సభ్యులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు, ప్రతినిధులు శంకర్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత నివారణకు అమృత ఆహారాన్ని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం అందించారు. భద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎన్.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ సాల్మన్ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యవంతులుగా ఉండాలని ఉద్దేశంతో ప్రభుత్వం మునగాకు, రాగి ముదురు బిస్కెట్లు పంపిణీ చేస్తుందని అన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండాలని, సుఖ ప్రసవాలు పొందాలని ఆమె సూచించారు.

ఎంపిపి తీర్మానాలను పరిగణనలోకి తీసుకోవద్దు

పాలకొండ: ఎంపిపి బొమ్మల భాను సభా విశ్వాసం కోల్పోయినందున పంచాయతీరాజ్ చట్టం 1994 సబ్ క్లాస్ ప్రకారం పాలనపరంగా చేసిన తీర్మానాలను పరిగణలోకి తీసుకోవద్దని వైస్ ఎంపిపి కడప సూరిప్రకాష్, ఎంపిటిసి సభ్యులు కోట అజయ్, పిన్నింటి లక్ష్మి, వారాడు సరస్వతి తదితరులు శనివారం ఎంపిడిఒ విజయ రంగారావును కోరారు. ఎంపిపి ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా ఆమోదించరాదని మెజార్టీ సభ్యులు విశ్వాసం కోల్పోయారని అన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక తమ్మినాయుడు ఇంటర్ కళాశాలలో శనివారం ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థి మీరబిళ్ల నిఖిల్ (16) అనుమానస్పద మృతి చెందాడు. కొత్తూరు మండలం కురుగాంకు చెందిన నిఖిల్ పదో తరగతిలో అత్యధిక మార్కులు సంపాదించడం వల్ల తమ్మినాయుడు కళాశాలలో ఫ్రీ ఎడ్యుకేషన్ కింద ఎంపిసి గ్రూపులో చేర్చుకున్నారు. అక్కడే హాస్టల్లో ఉంటున్నాడు. పండగ సెలవులకు ఇంటికి వెళ్లినప్పుడు సీనియర్లతో తగాదా ఉన్నట్లు చెప్పాడు. పండగలు సెలవుల్లో అనంతరం ఎప్పటిలాగే కళాశాలకు వచ్చాడు. శుక్రవారం 8 గంటలకు సమయంలో మూడు అంతస్తుల నుంచి కిందకి పడిపోయినట్లు గుర్తించిన యాజమాన్యం హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రయోగమూర్తి కళాశాలకు చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యువకుడు మృత్యువాత

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని తెలగ వీధికి చెందిన సునీల్ కుమార్ (35)అనే యువకుడు శనివారం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా మైగ్రేన్ తలనొప్పితో బాధపడుతూ మందులు వాడుతున్నప్పటికీ గత నెల 26వ తేదీన తలనొప్పితో పాటు వాంతులు రావడంతో వెంటనే చికిత్స కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారని అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రతిష్టాత్మక అవార్డుకు జిల్లా ఎంపిక కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధానమంత్రి ప్రతిష్టాత్మక అవార్డు- 2024కు జిల్లా ఎంపిక కావాలని, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పిఎం ఎక్స్ లెన్సీ అవార్డు, సూర్యఘర్ యోజనపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని తన సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 11అంశాల అమల్లో కనీసం ఆరు అంశాల్లోనైనా ముందంజలో ఉండాలని, తద్వారా పిఎం ఎక్స్‌లెన్సీ అవార్డుకు జిల్లా ఎంపిక కావాలని కోరారు. జిల్లాలో చేపట్టిన పథకాలు, లబ్ధిపొందిన వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించాలని, సాధించిన ప్రగతిపై డాక్యుమెంటరీని తయారు చేయాల్సి ఉంటుందని అన్నారు. అటువంటి ప్రగతి నివేదిక డాక్యుమెంటరీని పిఎం అవార్డు కోసం నామినేషనుకు పంపుతామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు ఆయా అధికారులు తమ శాఖలో నోడల్ అధికారులను నియమించుకొని చొరవ చూపాలని ఆదేశించారు. గత ఏడాది ఆకాంక్ష (ఆస్పిరేషనల్) జిల్లాగా దక్షిణ భారతదేశంలోనే భామిని బ్లాక్ అవార్డు సొంతం చేసుకుందని, ప్రస్తుతం ఎక్స్ లెన్సీ అవార్డు కూడా జిల్లా సొంతం చేసుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పిఎం సూర్య ఘర్ యోజన చాలా మంచి పథకమని, దీని ఏర్పాటుకు ప్రతి ఒక్కరికి బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని, రూ.78వేల వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా వినియోగదారుడు ఉచిత విద్యుత్‌ను వినియోగించుకోవడమే కాకుండా మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ జిల్లాలో యూనిట్లు అంత ఆశాజనకంగా లేదని, కావున దీనిపై విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. లబ్ధిదారుని స్పందనను, ప్రభుత్వం అందించే సదుపాయాలు, లాభాలపై ప్రజలకు తెలియజేసి ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, సెరికల్చర్ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు జి.శ్రీనివాసరాజు, సర్వేశ్వర రావు, డ్వామా, డిఆర్‌డిఎ పిడీలు కె.రామచంద్రరావు, వై.సత్యంనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, ఇతర వైద్యాధికారులు డా. బి.వాగ్దేవి, డా. ఎం.వినోద్ కుమార్, డా.టి.జగన్మోహనరావు,డా. కె.విజయ పార్వతి, జిల్లా విద్య, వ్యవసాయ, పరిశ్రమలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు ఎస్.తిరుపతి నాయుడు, కె.రాబర్ట్ పాల్, ఎం.వి.కరుణాకర్, ఓ.ప్రభాకర రావు,ఎల్డీఎం ఎన్.విజయ్ స్వరూప్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, డిపిఒ టి.కొండలరావు, భామిని క్లస్టర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ పర్యటన

పాలకొండ : నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు శనివారం ఉదయం పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించారు. 19వ వార్డులో గల్లరమండి పింఛన్లను పంపిణీ చేశారు. కస్పావీధి, గారంకాలనీ, వాండ్రంకివీధి, యాలాంజంక్షన్ కాలనీల్లో కమిషనర్ పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టారు.

3న కంటి వైద్య శిబిరం

వీరఘట్టం: మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీకి సమీపంలో శ్రీసత్య సాయి బాబా మందిర ఆవరణలో ఈనెల 3న విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా వారి ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ, బ్యాంకు ఖాతా, ఇతర గుర్తింపు కార్డులు ఉంటే తీసుకురావాలని వారు కోరారు.

ఒడిశా దూకుడును తగ్గించేదెప్పుడు?

ప్రజాశక్తి - సాలూరురూరల్

నిరంతరం ఆంధ్రా -ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు దూకుడును ప్రవర్తిస్తూ ఆంధ్రా అధికారులను, ఉద్యోగులను బెదిరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహా కార్యదర్శి శ్రీనివాసరావు ఆక్షేపించారు. అంగన్వాడీ కేంద్రంలో దౌర్జన్యంగా సామాన్లు ఎత్తుకుపోయిన ఒడిశా పోలీసుల చర్యకు నిరసనగా శనివారం ఆంధ్రా- ఒడిశా సరిహద్దు గ్రామమైన దిగువసెంబిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రా - ఒడిశా కొద్దిగా సరిహద్దు వివాదం స్వాతంత్ర్యం వచ్చి నేటి వరకు ఉభయ పక్షాలు పరిష్కరించుకోకుండా నిరంతరం ఉభయ రాష్ట్రాలు సమస్యను పరిష్కరించకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నాయని ఇది ఎంతవరకు సబుబని, ఇటువంటి చర్యలు వల్ల స్థానిక గిరిజనులు ఎంతో నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం కవ్వింపు చర్యలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందకుండా ఎక్కడ వేసిన గొంగళిగా అక్కడే ఉందని ఇప్పటికైనా ఉభయ రాష్ట్రాల్లో స్నేహపూర్వత ప్రభుత్వాలు ఉన్నాయని, ఈ సమస్యను పరిష్కరించడానికి మధ్యవర్తితంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఇటీవల కాలంలో ఒడిశా అధికారులు ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలోకి అక్రమంగా చొరబడి వస్తువులు తీసుకెళ్లడం తిరిగి ఇవ్వకపోవడం సరికాదని తెలిపారు. ఉభయ రాష్ట్రాల మధ్య గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఒడిశా ప్రభుత్వం దూకుడుకు అడ్డుకట్ట వేయాలని, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిలో రెండు రాష్ట్రాలు పోటీ పడాలని, గిరిజనులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు రక్షణ కల్పించాలని, సమస్యల పరిష్కారంలో చొరవ చూపించాలని కోరారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో కోనేటి బుచ్చి, బాత్రి, ఉత్తర, రుప్ప, విజయ తదితరులు పాల్గొన్నారు.

మేము బతకడం ఎలా?

కుమ్మర్ల ఆవేదన

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతులు వద్ద నుంచి ఉచితంగా మట్టి తీసుకొని వస్తే మైనింగ్ అధికారులు ట్రాక్టర్‌కు రూ.330లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, తాము బతకడం ఎలా? అంటూ కుమ్మర్లు పెనుగుర్తి సంతు, ఎం ఉమా, ఏ దుర్గారావు, పి లక్ష్మణరావు, ఏ పాపయ్య, పి రామకృష్ణ, పి శ్రీను, కే శ్రీను, ఉరిటీ సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని కడకల్లాలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటుకలు, కుండలు, తయారుచేసుకొని జీవనోపాధి సాగిస్తున్నామని, కుండలు కనుమరుగు కావడంతో తెలంగాణకు 300 కుటుంబాలు రాయలసీమకు 200 కుటుంబాలు వలస వెళ్లిపోయారని చెప్పారు. తాము పదిమందికి ఉపాధి కల్పించిన వారుమని, తమను మైనింగ్ అధికారులు ట్రాక్టర్‌కు రూ.330, జెసిబికి రూ.300, టన్ను కర్రకు రూ.3000, టన్ను ఊకకు రూ. 6వేలు చెల్లిస్తే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. చెరువులో మట్టి తవ్వుకోవాలని, ప్రభుత్వమే 1076 జీవోను ఇచ్చిందని, గుర్తు చేశారు. అధికారులు తమను ఇలా దోచుకుంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక ఫ్రీగా ఇస్తున్నప్పుడు మట్టి ఎందుకు ఫ్రీగా ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ వృత్తికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

కేరళ పర్యటనకు 36 మంది రైతులు

ప్రజాశక్తి- సీతంపేట

జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న పిఒ

మారిషస్ పైనాపిల్ పంటపై క్షేత్ర స్థాయిలో అవగాహన కోసం సీతంపేట, భామిని మండలాలకు చెందిన 36 మంది గిరిజన రైతులు శనివారం కేరళ పయణమయ్యారని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతులు పయనమయ్యే బస్సును ప్రాజెక్టు ఆయన శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేట, భామిని మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపడుతున్న మారిసస్ పైనాపిల్ పంటపై అవగాహన కల్పించడానికి గిరిజన రైతులను కేరళ తీసుకువెళ్లి అక్కడ పండిస్తున్న మారిషస్ పైనాపిల్ పంట విధానాలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పైనాపిల్ ప్రాసెసింగ్ యూనిట్లను చూపించి, ప్రాసెసింగ్ విధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు. వీటితో పాటు ఇతర హార్టికల్చర్‌కు సంబంధించిన పంటల విధానాలపై క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు ఈ సందర్భంగా పిఒ తెలిపారు. రైతులతోపాటు పిహెచ్ఒ వెంకట గణేష్, హెచ్ఒ జయశ్రీ, హార్టికల్చర్ అసిస్టెంట్లు దివాకర్, కావ్య తదితరులు వెళ్లారు.

దళిత, గిరిజనుల జోలికొస్తే సహించం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర

దళితులు, గిరిజనుల జోలికి ఎవరొచ్చినా సహించేది లేదని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని పెదబొండపల్లి, ఎమ్మానగర్ గ్రామంలో దళిత భూముల ఆక్రమణ విషయంలో ఆయన తీవ్రంగా స్పందించారు. 1980లో గ్రామానికి చెందిన కొంతమంది దళితులకు ప్రభుత్వం ఎకరా చొప్పున భూమి ఇచ్చిందన్నారు. ఆ భూమిలో వాళ్లు మామిడి, జీడి వంటి తదితర పంటలు సాగు చేశారని 2019 వరకు వారి సాగు బడిలోనే ఉన్నాయని వైసిపి పాలనలో అక్రమాలకు తెర తీశారని ఆరోపించారు. వైసిపి అండదండలతో చుక్క శ్రీదేవి అనే మహిళ దళితుల భూముల్లో రోడ్లు వేయడం, హద్దులు వేయడం చేశారని ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. వైసిపిలో ఎన్నో భూ అక్రమాలు జరిగాయని వాటికి చరమగీతం పాడతామన్నారు. అప్పటి ఎమ్మెల్యే జోగారావు దళితుడై ఉండి దళితులకు అన్యాయం చేశారన్నారు. తక్షణమే శ్రీదేవి పై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. దశాబ్దాలుగా భూమిని నమ్ముకున్న దళితులకు అన్యాయం చేసే వారిని చూస్తూ ఊరుకోమని తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే విజయ్ చంద్ర హెచ్చరించారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల గోడ పత్రిక విడుదల

పార్వతీపురంలో మార్చి 23వ తేదీన నిర్వహించనున్న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల గోడపత్రికలను ఎమ్మెల్యే విజయ్ చంద్ర శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. యువత శారీరక దారుఢ్యం, ఆరోగ్యం కోసం జిమ్ములో సాధన చేయడం మంచి అలవాటుని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పోటీలకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు, యువత పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై నిఘా

ప్రజాశక్తి - పార్వతీపురం

పాలకొండ మండలం గోపాలపురంలోని ఇసుక అక్రమ తవ్వకాలపై పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖాధికారి ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోపాలపురంలో గత నెల 24న సబ్‌కలెక్టర్, సంబంధిత రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్న 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లారీలు, రెండు టాటా హిటాచి యంత్రాలను సంబంధిత రెవెన్యూ అధికారులు పాలకొండ పోలీస్ స్టేషన్ కస్టడీకి అప్పగించినట్లు చెప్పారు. ఇకపై ఈ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా వాహనాలు తిరగకుండా అడ్డుకునేందుకు ప్రస్తుతం ఉన్న ఇసుక ర్యాంపుపై మూడు కందకాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భౌతిక పరిశీలన ప్రకారం సుమారు 450-500 మీటర్ల దూరంలో నీటి చౌరబాటు నిర్మాణం ఉందని, అందువల్ల ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలను నివారించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇది ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్ పరిధిలోనిది అయినందున, తదుపరి చర్యల కోసం సంబంధిత విభాగానికి లేఖ రాసినట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని దీనికోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కృషి చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజనశాఖా మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ సారథులను నియమించుకొని గ్రామ, వార్డు స్థాయిల్లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించుకుని మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గ స్థాయిలో అప్పటివరకు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించాలని అన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే అభివృద్ధి ఎలా సాధిస్తామని వైసిపి నాయకులకు మంత్రి ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజిదేవ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే వైసిపి నాయకులు దుష్ప్రచారాన్ని ప్రారంభించారని, దీన్ని ప్రతి కార్యకర్త తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సాలూరు పట్టణ, మండల, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, పిన్నింటి ప్రసాద్ బాబు, గుళ్ల వేణుగోపాలరావు, చలుమూరి వెంకట్రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అదనపు భూసారం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

రైతులతో మాట్లాడుతున్న నూకం నాయుడు

అంతర పంటలతో అదనపు భూసారం వస్తుందని జట్టు ఫస్ట్ కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నూకం నాయుడు అన్నారు. మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో పువ్వుల ఆశమ్మ మామిడి తోటలో అంతర పంటలుగా వేసిన క్యారెట్, ముల్లంగి, పాలకూర, గోంగూర, మెంతి కూర, చిక్కుడు, టమాట, వంగ, మిరప, క్యాబేజీ పంటను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు ఆర్థిక సహకారంతో, జట్టు సంస్థ పర్యవేక్షణలో మండలంలోని 12 గ్రామాల్లో, 150 మంది రైతులతో పండ్ల తోటల్లో అంతర పంటలు వేయించామన్నారు. దేశీ వరి విస్తీర్ణం పెంచడం, కిచెన్ గార్డెన్లు, ఏడాది పొడవునా పంటలు పండించే విధానం, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల రైతులు ఆర్థికాభివృద్ధి చెందడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతారన్నారు.అనంతరం రైతు ఆశమ్మ పండ్ల తోటల్లో అంతర పంటలు వేసుకోవడం వల్ల ప్రతిరోజు ఇంటి అవసరాలు తీర్చుకోవడంతో పాటు మిగిలిన పంటలను అమ్ముకుంటున్నారన్నారు. భూమిపై నిత్యం పంటలు ఉండడం వల్ల ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి . ప్రబోధ్, జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మచ్చ కుష్టు వ్యాధి కాదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతీ మచ్చ కుష్టి వ్యాధికి చిహ్నం కాదని, కుష్టి వ్యాధి లక్షణాలను స్పష్టంగా తెలుసుకొని స్థానిక వైద్యులను సంప్రదిస్తే దాని నివారణ సుశాధ్యమేనని జియ్యమ్మవలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి. జగదీష్ తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్టి వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆశా వర్కర్లు పాఠశాల విద్యార్థులతో ర్యాలీ మానవహారం కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ ఎం.బలరాం నాయుడు, హెచ్ఎస్ శ్రీనివాసరావు, సిహెచ్ఒ హైమావతి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు, సిహెచ్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని వీరఘట్టం, బిటవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో శనివారం ముమ్మరంగా కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టారు. ఈ మేరకు హుస్సేన్ పురం, నీలా నగరం, రేగులపాడు, వండువా, తూడి, నర్సిపురం, కొట్టుగుమ్మడ, గడగమ్మ, విక్రమపురం, కంబర, నడుకూరు, నడిమికెల్లా తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. శరీరంపై ఏం విధమైన మచ్చలు ఉన్నా తక్షణం తనిఖీలు చేసుకోవాలని సూచించారు.

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి- సీతానగరం

ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయ గౌరీని గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్ మండల శాఖ శనివారం ప్రచారం నిర్వహించింది. మండలంలోని గాదెలవలస, ఆర్. వెంకంపేట, సీతానగరం, బూర్జ, నిడగల్లు, మరిపివలస ఉన్నత పాఠశాలల, కెజిబివి, ప్రతిభా పాఠశాల జోగంపేటలలో ప్రచారం నిర్వహించి ప్రథమ ప్రాధాన్యతా ఓటు ఆమెకు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయ, విద్యా సమస్యల పట్ల సుదీర్ఘ పోరాటం చేస్తున్న విజయగౌరిని శాసనమండలికి పంపించడం ద్వారా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మార్గం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు ఉపాధ్యక్షులు ఏ.పోలినాయుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎమ్. గోవిందరావు, టి. అప్పల నాయుడు, బి. ఆదినారాయణ, కె.మురళి మండల కౌన్సిల్ సభ్యులు సి.ఎచ్. గణపతి, జి.దాలయ్య, జె. సింహాచలం, బి. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ కింద సాగు పరిశీలన

ప్రజాశక్తి- పాచిపెంట

కొండమూసురు, గుమ్మివలస, మూల పాడు, దొరలుద్దంగి గ్రామాలలో సాగవుతున్న పంటలను, చెక్ డ్యామ్ స్థితిగతులను వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు శనివారం పరిశీలించారు. ఈ నాలుగు గ్రామాలలో చెక్ డ్యామ్‌లకు చిన్నచిన్న మరమ్మతులు అవసరమని జెడ్‌పి వైస్ చైర్మన్ జన్ని సింహాచలం, క్యారంగి సర్పంచ్ సోమల లచ్చయ్య అన్నారు. ఈ గ్రామాలలో ఆరు చెక్ డ్యాముల కింద రబీ పంటలో కూడా మొక్కజొన్న, వరి సాగవుతుందని చెక్ డ్యామ్ మరమ్మతులు చేపడితే ఆయకట్టు మరింత స్థిరపడుతుందని సుమారు 300 ఎకరాలు ఖరీఫ్ సీజన్లోనూ 150 ఎకరాలకు పైగా రబీ సీజన్లో పంటలకు నీరు అందించవలసిన రిటైనింగ్ గోడలు ఫ్లాట్ ఫారంలు పాడైపోయాయని తెలిపారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ విషయాలను జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ద్వారా తెలియపరుస్తామన్నారు. అనంతరం డ్యాముల కింద సాగవుతున్న వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటకు ఆశించిన కత్తెర పురుగు నివారణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. కత్తెర పురుగు నివారణకు తప్పనిసరిగా గుడ్లను నివారించే వేప మందు లేదా వేప కషాయం పిచికారీ చేసుకోవాలన్నారు. కొండలపై మొక్కజొన్న లాంటి పంటలు వేయడం కంటే చెక్ డ్యామ్ కింద చిరుధాన్యాల సాగు చేపడితే అధిక ఆదాయం వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సచివాలయాన్ని పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామపంచాయతీలో ఇంటి పన్ను బకాయి వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపిడిఒ జి.పైడితల్లి వెల్లడించారు. మండలంలోని రాయిందొరవలస గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయానికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అలాగే పంచాయతీలో చేపడుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ పైడితల్లి మాట్లాడుతూ గ్రామపంచాయతీలో ఇంటి పన్ను బకాయిలు వసూళ్లు శత శాతం చేపట్టాల్సి ఉందని పంచాయతీ కార్యదర్శి దత్తి సురేష్‌కుమార్‌కు సూచించారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించాలని పేర్కొన్నారు.

ఎస్ డబ్ల్యుపిసిలను పరిశీలన

అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపిడిఒ పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో నిర్మిస్తున్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. గ్రామపంచాయతీల్లో సేకరించిన చెత్తను నిర్మాణం చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఇఒపిఆర్‌డి ఎల్ గోపాలరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అంబటి తవిటినాయుడు (రాంబాబు), బేత వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

13న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- సీతంపేట

ఇళ్ల స్థలాల మంజూరు కోసం ఈ నెల 13న కలెక్టరేట్ వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా బాధ్యులు జి. ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మధరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇల్లు స్థలం పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇల్లు స్థలాలు మంజూరైన గృహాలకు ఐదు లక్షల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లు అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులకు రక్త రక్తహీనత నివారణ చర్యల్లో భాగంగా న్యూట్రీన్స్ కిట్లను అంగన్వాడి సూపర్‌వైజర్ సుగుణ శనివారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పిల్లలకు కేంద్రాలలో పౌష్టికాహారం అందించడంతోపాటు ప్రీస్కూల్ విద్యను నేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతిలక్ష్మి, జయలక్ష్మి, నాగమణి, విజయమ్మతో పాట అంగన్వాడి సిబ్బంది, బాలింతలు గర్భిణులు పాల్గొన్నారు

కిమ్మిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో శనివారం స్థానిక వైద్యాధికారి పి. ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, బాలింతలు, మధుమేహం, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.